సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024

దాచుకున్న పింఛన్ డబ్బులు చోరీ



పాచిపెంట: మండల కేంద్రంలోని రాచవీధిలో ఓ ఇంట్లో పట్టపగలు ఓ మహిళ దాచుకున్న పింఛన్ డబ్బులు చోరీకి గురైనట్టు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక రాచవీధిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న కలగర్ల రవణమ్మ అనే పింఛన్‌దారు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులు ఇంట్లో దాచుకుంది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కూరగాయలు కొనుగోలుకు బజారుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఆమె దాచుకున్న పింఛన్ డబ్బులు రూ.20వేలు లేకపోవడంతో ఇంట్లో దొంగలు పడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేశామని ఏఎస్‌ఐ శ్యామ్ తెలిపారు.

వీఆర్‌ఎస్ ప్రాజెక్టు నీరు విడుదల

మక్కువ: ఒడిశాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సువర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వెంగళరాయసాగర్ ప్రాజెక్టులోకి 500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు రెగ్యులేటర్ నుంచి తిరిగి నదిలోకి 300 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యూస్‌రీల్

బెడ్‌కు ఇద్దరు పేషెంట్లు



ఒకే బెడ్‌పై వైద్యసేవలు పొందుతున్న ఇద్దరు రోగులు

సీతంపేట: మన్యంలో జ్వరాల తాకిడి ఎక్కువగా ఉంది. సీతంపేట ఏరియా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇన్‌పేషెంట్ల కోసం ఆస్పత్రిలోని బెడ్‌లు చాలడం లేదు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి బెడ్‌ల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

47 కిలోల తలనీలాలు రూ.1,75,100



తోటపల్లిలో నిర్వహించిన వేలంలో పాల్గొన్న సిబ్బంది, భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో భక్తులు సమర్పించిన 47 కిలోల తలనీలాలను గురువారం వేలం వేశారు. ఏలూరుకు చెందిన యాపాటి వెంకటేశ్వరరావు రూ.1,75,100కు పాట దక్కించుకొన్నారు. ఏడాదిపాటు కొబ్బరి చెక్కలను సేకరించేందుకు తోటపల్లికి చెందిన మార్కొండ శీతంనాయుడుకు వేలంపాట ఖరారైంది. ఈఓ వి.వి.సూర్యనారాయణ, పార్వతీపురం గ్రూపు దేవాలయాల ఈఓ ఎం. ప్రసాద్ సమక్షంలో వేలంపాట జరిగింది.

తప్పు సరిదిద్దుకోలేక తడబాటు



పాత డేట్‌తో అందజేసిన రశీదు

సీతానగరం: గ్రామ అభివృద్ధి పేరుతో సామాజిక పింఛన్ లబ్ధిదారుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన టీడీపీ నాయకుల బండారం బట్టబయలైంది. సీతానగరం మండలం చెల్లన్నాయుడువలసలో పింఛన్‌దారుల నుంచి టీడీపీ నాయకుల అక్రమవసూళ్లపై 'పింఛన్ డబ్బులు నొక్కేద్దాం' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితైన కథనంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆరా తీశారు. విచారణకు ఆదేశించినట్టు సమాచారం. అక్రమ వసూళ్ల విషయం అందరికీ తెలియడంతో టీడీపీ నాయకులు ఉలిక్కిపడ్డారు. తప్పు సరిద్దుకోలేక తడబడుతున్నారు. శని, సోమవారాల్లో పింఛన్ డబ్బులు వసూలు చేయగా, పాత తేదీతో డబ్బులు వసూలు చేసినట్టు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రశీదులు ఇచ్చారు. వాస్తవంగా గ్రామాభివృద్ధి పేరుతో ఎవరి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయకూడదన్న ప్రభుత్వ నిబంధనను మరిచిపోయారు. అందులోనూ కేవలం పింఛన్ దారుల నుంచే ఎందుకు వసూలుచేశారన్న ప్రశ్న తలెత్తుతోంది. తప్పును మళ్లీ తప్పుతో కప్పిపుచ్చుకునే యత్నాలను గ్రామస్తులు తప్పుబడుతున్నారు. అవ్వాతాతల జీవన భృతికోసం ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులను దౌర్జన్యంగా లాక్కోవడం తగదంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్...

పర్యావరణ హితాయా..

ఓ మట్టి గణపయ్యా!



''ఓం ఏకదంతాయ విద్మహే, వక్రతుండాయ ధీమహి తన్నోదంతి ప్రచోదయాత్..'' విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడు. హిందూ సంప్రదాయంలో మొదటి పూజ ఆయనకే. జ్ఞానం ప్రసాదించడంలో ఆది దేవుడు ఆ గణనాథుడు. స్వచ్ఛమైన మనసు, ఆరాధించే సమయంలో శ్రద్ధతో పూజిస్తే చాలు.. కోరిన కోర్కెలు తీర్చుతాడని భక్తుల నమ్మకం.

పసుపు ముద్ద.. గడ్డి పూచ.. మట్టి బొమ్మ.. ఎలా తీర్చిదిద్దినా, ఏ ఆకృతితో మలిచినా లంబోధరునికి ఆనందమే. నేడు అందమైన రూపాల కోసమని.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో కూడిన రంగులను ఉపయోగించి గణపతి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. నిమజ్జనం సమయంలో ఇవి నీటిలో కరగవు. పర్యావరణానికి ముప్పు తెచ్చే ఇటువంటి విగ్రహాలకు బదులు.. మట్టి ప్రతిమలు మేలని నిపుణులు చెబుతున్నారు. అసలు.. వినాయక చవితి పరామర్థం కూడా పర్యావరణ హితమే అని మన పెద్దలు చెప్పే మాట.

-సాక్షి, పార్వతీపురం మన్యం

- ఈనెల 7న వినాయక చవితి పర్వదినం
- ఆరోగ్యం.. ఆనందానికి మట్టి ప్రతిమలే మేలు
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దంటున్న నిపుణులు

నిమజ్జనం అర్థం అదే..

నిమజ్జనం చేయడమంటేనే నీటిలో కలిపేయడం. ఒండ్రుమట్టితో తయారు చేసిన విగ్రహాలను ఆ మట్టిలోనే తిరిగి కలిపేయాలి. పెద్ద విగ్రహాల తయారీలో వాడే వస్తువులు నీటిలో కరిగిపోవు. దీనివల్ల పర్యావరణానికి, భవిష్యత్తు తరాలకు హాని చేసిన వారమవుతాం. మట్టి గణపతిని పూజించడం ద్వారా అనేక యాగాల ఫలితాలు పొందుతారని పండితులు చెబుతున్నారు. మట్టి గణపతి వల్ల పాజిటివ్ ఎనర్జీ వస్తుందని అంటారు.

జల, జీవరాశుల మేలు కోరి..

జిల్లాలో వేలాదిగా విగ్రహాలు ఏటా పెడుతుంటారు. ఇందులో అధిక శాతం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసినవే. అనేక నదులు, చెరువులు, వాగులు మన ప్రాంతం సొంతం. వీటి ద్వారా ఎంతోమందికి తాగునీరు, సాగునీరు అందుతోంది. మనుషులే కాక.. పశువులు, చేపలు, ఇతర జీవరాశులు ఈ నీటిని వినియోగిస్తాయి. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, నదుల్లో కలపడం వల్ల అవి కరగకపోగా.. కెమికల్స్ అన్నీ ఈ నేలను, జలాలను కలుషితం చేస్తాయి. రసాయనాల్లో ఉండే జిప్సం, సల్ఫర్, మెగ్నీషియం వంటివి జీవవైవిధ్యానికి హాని కలిగిస్తాయి. దీనివల్ల జీవరాశులతో పాటు.. ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు. గాలి, నేల, నీటిని విషతుల్యం చేసే ఇటువంటి చర్యలు వద్దని పర్యావరణ నిపుణులు చెబుతుంటారు.

ఏ రూపమైనా.. బుజ్జ గణపయ్యకు అమితానందమే!

లంబోధరుడిని ఏ రూపంతో కొలిచినా అమితానందం చెందుతాడు. అందుకే కొంతమంది వివిధ రూపాలతో గణనాథుడిని తయారు చేస్తారు. గడ్డిపోచలు, ఆకులు, టెంకాయలు. కర్జూరాలు, శనగకాయలు, ఎండు ఫలాలు.. ఇలా భిన్న రూపాలతో వినాయకుడిని తీర్చిదిద్దుతున్నారు. ఇవన్నీ పర్యావరణ హితమైనవే.

ఉచితంగా మట్టి ప్రతిమల పంపిణీ

పర్యావరణ హితం కోరి పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలోనూ ఏటా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. పార్వతీపురంతోపాటు, సాలూరు, పాలకొండ, కురుపాం, వీరఘట్టం తదితర మండల కేంద్రాల్లోనూ వినాయక చవితి ముందు రోజు వేలాది మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేస్తున్నారు. ఈ విగ్రహాలు ఇళ్ల వరకే పరిమితం అవుతున్నాయి. మండపాల్లో భారీ విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసినవే ఉంటున్నాయి. మండపాలకు అనుమతులిచ్చే ముందే.. కఠినమైన నిబంధనలు ఉంటే మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సాలూరు కుమ్మరి వీధిలో మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహానికి తుదిమెరుగులు అద్దుతున్న కళాకారుడు

మట్టితోనే జీవనం

సాలూరు: గణపతి పూజ వచ్చిందంటే కుమ్మర్ల సంతోషానికి అవధులు ఉండవు. మట్టితో వివిధ పాత్రలు, విగ్రహాలు, ప్రమిదలు, ప్రతిమల తయారీలో చేయితిరిగిన నైపుణ్యం వారి సొంతం. సాలూరులోని పదుల సంఖ్యలోని కుమ్మరి కుటుంబాలు దశాబ్దాలుగా మట్టినే నమ్ముకుని జీవిస్తున్నాయి. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ మట్టితో అందమైన వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. భక్తుల అభిరుచి మేరకు వందలాది విగ్రహాలు, చిన్నచిన్న ప్రతిమలను తయారుచేసి తుదిమెరుగులు అద్దుతున్నారు. అయితే, ఇటీవల కాలంలో ప్లాస్టర్‌ఆఫ్ పారిస్ విగ్రహాల కొనుగోలుకు యువత ఆసక్తి చూపడం, దేవుడి గుడుల్లో మట్టి ప్రమిదలకు బదులు లోహాలతో తయారుచేసే ప్రమిదల్లో దీపారాధన చేస్తుండడం, కుండల స్థానంలో సిల్వర్, స్టీల్ పాత్రలు రావడంతో చేతివృత్తికి ఆదరణ తగ్గిందని కుమ్మర్లు వాపోతున్నారు. ఒకప్పుడు కుమ్మరి చక్రం తిరిగితే మనసుకు ఆనందంగా ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితులు లేవన్నారు. ఇటీవల కాలంలో పర్యావరణంపై అవగాహన పెరగుతుండడంతో అధికమంది మట్టివిగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్టు పలువురు కుమ్మర్లు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం



సాలూరులో విద్యార్థులకు మట్టి విగ్రహాల పంపిణీ

మట్టి ప్రతిమలు పర్యావరణానికి మేలు చేస్తాయి. ఇది సైంటిఫిక్‌గా కూడా రుజువైంది. మన పెద్దలు అందుకే మట్టి ప్రతిమలను పూజించాలంటారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి, జీవరాశుల ఆరోగ్యానికి ప్రమాదం. విద్యార్థి దశ నుంచే దీనిపై అవగాహన అవసరం. దీనిపై చైతన్యం తీసుకొస్తూ ఏటా ఉచితంగా పెద్ద ఎత్తున మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం.

– కోదూరు సాయి శ్రీనివాసరావు, సాలూరు

50 ఏళ్లుగా మట్టి విగ్రహానికే పూజలు



వీరఘట్టం: జిల్లా వ్యాప్తంగా వీధివీధినా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించడం చూస్తుంటాం. అయితే, వీరఘట్టం కూరాకులవీధికి చెందిన శ్రీకృష్ణా సేవా సంఘం సభ్యులు 50 ఏళ్లుగా మట్టివిగ్రహాన్నే పూజిస్తూ.. పర్యావరణ ప్రేమికులుగా పేరుగడించారు. కూరాకుల వీధిలోని 600 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా ఐక్యంగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తారు. రాబోయే 10 ఏళ్లలో వినాయక చవితి ఉత్సవాలకు ఎవరు విగ్రహాన్ని తయారు చేయాలో ముందుగానే నిర్ణయించుకుంటారు. సీరియల్ ప్రకారం ఎవరి పేరు ఉంటే వారు బొమ్మను (మట్టి గణపతి) వీధిలోనే తయారు చేయిస్తారు. దీనిని అదృష్టంగా భావిస్తారు. ఐదురోజుల పాటు వినాయక ఉత్సవాలు నిర్వహిస్తారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఏటా లక్షపత్రి పూజ చేస్తారు. ఉత్సవాలకు బంధుమిత్రులందరినీ ఆహ్వానిస్తారు. అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం జరుపుతారు.

ఈ ఏడాది ప్రతిష్ఠించేందుకు కూరాకులవీధిలో తయారు చేస్తున్న 12 అడుగుల మట్టి గణపతి విగ్రహం

స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- వసతిగృహాలకు కలెక్టర్ 20 ఫ్యాన్లు వితరణ

పార్వతీపురం:

స్వయం ఉపాధి యూనిట్లు ప్రారంభించేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బ్యాంకర్లకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి బ్యాంకులు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటుచేసేవారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్లు గ్రామీణ ప్రజలకు బ్యాంకుసేవలు అందేలా చూడాలన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకె)ను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సామాజిక కార్యక్రమాల్లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని సూచించారు. జిల్లాలోని వసతి గృహాలకు చిన్నచిన్న సౌకర్యాల కల్పనకు సహకరించాలని కోరారు. తన వంతుగా వివిధ వసతి గృహాల విద్యార్థులకు ఉపయోగపడేలా 20 ఫ్యాన్లు అందజేస్తానని కలెక్టర్ ప్రకటించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు కూడా ఐదు ఫ్యాన్లు వితరణగా అందిస్తానని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి

సైబర్ నేరగాళ్లపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకులకు సంబంధించిన సమాచారం, ఓటీపీలు అడగడం, లింకులు పంపించడం, బహుమతులు, లాటరీలు వచ్చాయని వివిధ రూపాల్లో నేరాలకు పాల్పడుతుంటారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారులు చెప్పరాదని, ఓపెన్ చేయరాదని సూచించారు. సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ డి.ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి, సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, చేనేత జౌళిశాఖ అధికారి ఎస్.రమణ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్ట్

విజయనగరం క్రైమ్: డెంకాడ మండలం చింతలవలస గ్రామంలో ఎంవీజీఆర్ కళాశాల వద్ద ఉన్న నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఏడు గురు నిందితులను డెంకాడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయిస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో ఎస్‌ఐ సన్యాసినాయుడు సిబ్బందితో దాడి చేశారు. నిందితులను పట్టుకుని వారి నుంచి 2 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం వంచనారంగిని గ్రామం బూర్జ పంచాయతీకి చెందిన సామర్థి నాగేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన గణేశ్వరం సంజయ్ కుమార్, డెంకాడ మండలం రఘుమండ గ్రామానికి చెందిన దుర్గాసి కనకరాజు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లికి చెందిన టొంపల నాగభూషణం, రణస్థలంకి చెందిన రాజ మహంతి అనిల్ కుమార్‌తో పాటు డెంకాడ మండలం రఘుమండ గ్రామానికి చెందిన బత్తుల కిరణ్, చింతలవలసకు చెందిన చీకటి సందీప్ గంజాయి సేవించడానికి, విక్రయించడానికి అలవాటు పడ్డారు. వీరికి గంజాయి విక్రయించే ఏఎస్‌ఆర్ జిల్లాకు చెందిన ఎస్.నాగేశ్వరరావు, సంజయ్‌కుమార్, కనకరాజుతో పాటు మొత్తం ఏడుగురును అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు.

ఆండ్ర రిజర్వాయర్‌లో మునిగి యువకుడి మృతి

మెంటాడ: ఆండ్ర రిజర్వాయర్‌లో మునిగి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ బీటుగరువు గ్రామానికి చెందిన గమ్మెళ భీమరాజు(22) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆండ్ర రిజర్వాయర్‌లో చేపల వేటకు పరిసర గ్రామాల గిరిజనులు వస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో బీటుగరువు గ్రామానికి చెందిన పలువురు చేపల వేటకు వెళ్లారు. భీమరాజుతో పాటు ముగ్గురు యువకులు వలవేసి తీసే సమయంలో ప్రమాదవశాత్తు భీమరాజు నీటిలో మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు ఒడ్డున ఉండి ఎంతకీ రాకపోవడంతో వేరే మార్గంలో వెళ్లిపోయి ఉంటాడని భావించి వెనక్కి వెళ్లిపోయారు. తీరా చూస్తే ఇంటికి భీమరాజు చేరలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు మృతదేహం తేలడం చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు విచారణ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు.



భీమరాజు మృతదేహం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



మామిడి శ్రీకాంత్



గణపతిరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షుల నియామకం జరిగింది. వాటిలో తూర్పుకాపు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్, దాసరి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రంగుముద్రి గణపతిరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని గళావిల్లి గ్రామానికి చెందిన మామిడి శ్రీకాంత్ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గతంలో శ్రీకాంత్ పనిచేశారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా 2021లో నియామకయ్యారు. 2024 ఏప్రిల్ వరకూ ఆ పదవిలో ఉన్నారు. పార్టీకి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు రాష్ట్రంలోనే అతిపెద్ద సామాజిక వర్గ విభాగానికి అధ్యక్షుడిగా అవకాశమిచ్చిన పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో పలు విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలను ఏర్పాటుచేసిన డాక్టర్ రంగుముద్రి గణపతిరావు వైఎస్సార్‌సీపీలో పలు సేవలు అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉత్తరాంధ్ర కీలకమైన దాసరి సామాజికవర్గ రాష్ట్ర విభాగానికి ఆయనను అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన భార్య డాక్టర్ రంగుముద్రి రమాదేవి రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలోని అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి లైసెన్సు, అనుభవం, తదితర వివరాలతో సెక్రటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాన గండం!

- మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం
- 15 నుంచి వంద మి.మీ. వరకు కురవచ్చని అంచనా
- అల్పపీడనంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం



సాక్షి, పార్వతీపురం మన్యం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అప్రమత్తం చేశారు. ఈ నెల 6,7,8 తేదీల్లో 15 నుంచి వంద మిల్లీమీటర్ల వరకు వర్షం కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలూ పని చేసేలా కంట్రోల్ రూం –08963 293046 ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్న యంత్రాంగం

జిల్లాలో గురువారం ఉదయం ఎండ తీవ్రత ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత వాతావరణం పూర్తిగా మారిపోయింది. మబ్బులు పట్టి, ఉరుములతో కొన్ని చోట్ల వర్షం కురిసింది. మరోవైపు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేస్తోంది. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేస్తున్నారు. అటువంటి ప్రదేశాల్లో సిబ్బందిని ఉంచడంతోపాటు.. సూచనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

గెడ్డలు, వాగులు దాటొద్దు...

గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉందని.. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని కలెక్టర్ శ్యాంప్రసాద్ హెచ్చరించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. ఆయా ప్రదేశాల్లో పోలీసు, వలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని సూచించారు. గతంలో జరిగిన విపత్తుల పరిస్థితిని గ్రామాల్లో తెలుసుకుని పక్కా ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, అనకట్టలు తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని.. గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలన్నారు. రహదారులపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే వాటిని తొలగించేందుకు అవసరమయ్యే పరికరాలు, జేసీబీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తుపాను, వరదల అనంతరం పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్, క్లోరినేషన్ నిల్వలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, వాటికి అవసరమయ్యే ఆహారం అందించడానికి ఏర్పాట్లు చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు.

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్
08963 293046

నేడు పాచిపెంట మండలంలో పాఠశాలలకు సెలవు

అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పాచిపెంట మండలంలో అన్ని పాఠశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించినట్టు ఆర్డీఓ కె.హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాచిపెంట మండల తహసీల్దార్, ఎంఈఓ సిఫార్సుల మేరకు సెలవు ప్రకటించినట్టు ఆమె తెలిపారు.